గౌరవర్ణ స్వరూపిణి పరమేశ్వర హృదయ నివాసిని



అష్టాదశ శక్తిపీఠ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు నేత్రశోభితంగా జరుగుతున్నాయి. ఉత్సవాల ఎనిమిదో రోజు గురువారం రాత్రి 7 గంటలకు భ్రమరాంబాదేవి మహాగౌరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రత్యేక వేదికపై తేజోమయరూపంలో మహాగౌరి కొలువుదీరారు. చతుర్భుజ స్వరూపిణిగా సాక్షాత్కరించారు. కుడి చేత త్రిశూలాన్ని, ఎడమ చేతిలో ఢమరుకాన్ని ధరించి, అభయహస్తదీవెనలతో ఆశీనులై పూజలందుకున్నారు. అక్కమహాదేవి అలంకార మండపంలో ముగ్ధమనోహరమైన పుష్పాలంకరణలతో ముస్తాబైన నందివాహనంపై పార్వతీపరమేశ్వరులు ఆశీనులయ్యారు. ఉభయ దేవాలయాల అర్చకులు స్వామి అమ్మవార్లకు పుష్పార్చనలు చేసి మంగళహారతులతో పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కళాకారులు నృత్య సందడి చేసి భక్తులను ఆకట్టుకున్నారు.



ఉత్సవం సందర్భంగా ఆలయం వద్ద కళాకారుల సందడి



శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే



భ్రమరాంబకు నేడు పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి ఆనం

శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాల తొమ్మిదో రోజు శుక్రవారం రాత్రి 7 గంటలకు శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. రాత్రి 8 గంటలకు శ్రీభ్రమరాంబాదేవి భక్తులకు సిద్ధిదాయిని అలంకారంలో దర్శనమివ్వనున్నారు. శ్రీస్వామిఅమ్మవార్లకు అశ్వవాహనసేవ, గ్రామోత్సవం జరుగనున్నాయి.



నందివాహనంపై కొలువైన స్వామిఅమ్మవారు



స్వామివారి ధ్వజస్తంభానికి విశేష పుష్పాలంకరణ



సమీక్షిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

సాగునీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలని కలెక్టర్ జి.రాజకుమారి తహసీల్దార్లు, నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాగునీటి సంఘాల ఎన్నికలపై ఆమె సమీక్షించారు. ఈనెల 16 నుంచి నవంబరు 24వ తేదీ వరకు జిల్లాలో వివిధ దశల్లో ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. స్థిరీకరించిన ఆయకట్టుదారుల ఓటరు జాబితా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. తెలుగుగంగ ప్రాజెక్టు కింద 47, కేసీ కాల్వ పరిధిలో 50, చిన్ననీటి పారుదల చెరువుల కింద 105 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఒక్కో సంఘం నుంచి 6 నుంచి 8 మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. డీఆర్వో పద్మజ, ఇరిగేషన్ ఎస్ఈ వరప్రసాద్ నోడల్ అధికారులుగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. మాస్టర్ ట్రైనర్లుగా డోన్ ఆర్డీవో మహేశ్వరరెడ్డి, ఏఈఈ విజయకుమార్‌లను నియమించినట్లు వెల్లడించారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ, నంద్యాల ఆర్డీవో మల్లికార్జునరెడ్డి, తెలుగుగంగ ఎస్ఈ సుబ్బరాయుడు, కేసీ కాల్వ ఈఈ ప్రతాప్, మైనర్ ఇరిగేషన్ ఈఈ రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోకులాల్లో పొంగిన అక్రమాలు

2014- 19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో పాడి రైతుల కోసం ఉపాధిహామీ పథకం నిధులతో గోకులం షెడ్లు నిర్మించారు. పశువులను సంరక్షించి పాల ఉత్పత్తి పెంచాలి.. పాడి రైతుల జీవోనాపాధులు మెరుగుపర్చాలన్న లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,250 యూనిట్లు మంజూరు చేశారు. ఉపాధిహామీ పథకం, పశు సంవర్ధకశాఖ అధికారులతో కమిటీలు కూడా ఏర్పాటు చేశారు.

నంద్యాల పట్టణం, ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే :

■ రూ.5 కోట్లకు నేటికీ లెక్కలు తేలని వైనం

● మండలం	● ఏజెన్సీకి ఇచ్చిన పనులు	● చెల్లింపులు (రూ.లక్షల్లో)
ఉయ్యాలవాడ	70	41.23
కోడుమూరు	32	32.45
కోవెలకుంట్ల	45	41.23
తుగ్గలి	21	18.25
మద్దికెర	16	14.21
పాములపాడు	27	28.79



తుడుములదిన్నెలో నిర్మించుకున్న గోకులం షెడ్డు

ఎన్నికల ముందు పంచేశారు

ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో గోకులం షెడ్ల నిర్మించారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేశారు. ఇందులో రైతు తన వాటా కింద రూ.20 వేలు చెల్లిస్తే మిగతా మొత్తం ప్రభుత్వం భరించేది. చాలాచోట్ల నిర్ణీత సమయానికి బిల్లులు రాకపోవడంతో పనులు ప్రారంభించిన పాడి రైతులు సొంత డబ్బులు వెచ్చించి షెడ్లను నిర్మించుకున్నారు. ఈ క్రమంలో 2019లో రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల పాటు పట్టించుకోలేదు. ఎన్నికల ముందు గోకులం షెడ్లకు నిధులు విడుదల చేసింది.

రూ.60 వేలే వచ్చింది

– సుబ్బారెడ్డి, తుడుములదిన్నె, ఉయ్యాలవాడ



నేను రూ.1.80 లక్షలు ఖర్చు పెట్టి షెడ్డు వేసుకున్నా. ఇప్పటి వరకు రూ.60 వేలు మాత్రమే అందింది. మిగతా డబ్బు కోసం పశువైద్యాధికారులను సంప్రదించినా ప్రయోజనం లేదు. ముందుగా నిర్మించుకుంటే బిల్లులు తర్వాత చెల్లిస్తామని చెబితే సొంత డబ్బులతో కట్టుకున్నాం. ఇంత వరకు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించలేదు.

ఏజెన్సీ ఖాతాకు రైతుల సొమ్ము

ఉమ్మడి జిల్లాలోని ఉయ్యాలవాడ, మద్దికెర, పత్తికొండ, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, పగిద్యాల, కోడుమూరు, గోనెగండ్ల, తుగ్గలి, కొలిమిగుండ్ల, ప్యాపిలి, సి.బెళగల్, గూడూరు, ఓర్వకల్లు, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో రైతులే స్వయంగా షెడ్లు నిర్మించుకున్నారు. గత ప్రభుత్వం మాత్రం ఓ ఏజెన్సీకి నిధులు విడుదల చేసింది. కొన్నిచోట్ల అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలకు సంబంధించిన మొత్తాన్ని కూడా రైతులకు కాకుండా ఏజెన్సీ ఖాతాల్లో జమ చేశారు. ఉయ్యాలవాడ మండలం తుడుములదిన్నె, అల్లూరు, ఉయ్యాలవాడ గ్రామాల్లో పలువురు రైతులకు అందాల్సిన సొమ్ము ఏజెన్సీలకు చేరింది.

అసంపూర్తి పనులకూ చెల్లింపులు

మద్దికెర, దేవనకొండ, తుగ్గలి, మంత్రాలయం, గోనెగండ్లతో పాటు ఓర్వకల్లు, డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, కొలిమిగుండ్ల, అవుకు, సంజామల, కోవెలకుంట్ల, రుద్రవరం, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లోని పనులు అసంపూర్తిగా ఉన్నాసరే పూర్తిస్థాయిలో బిల్లులు చేశారు. ఇలా సుమారు రూ.2 కోట్ల వరకు బిల్లులను ఒక ఏజెన్సీకి జమ చేశారు. ఉమ్మడి జిల్లాలోని సుమారు వంద షెడ్ల నిర్మాణానికి సంబంధించి ఎం.బుక్ ఇతర దస్త్రాలు కూడా లేవన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా ఉమ్మడి జిల్లాలో రూ.5 కోట్ల వరకు అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయి. పశు సంవర్ధక శాఖ, ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది కొంతమంది ఈ నిధులను దారి మళ్లించారు.



అటకెక్కిన.. యాంత్రీకరణ

వ్యవసాయ యాంత్రీకరణే లక్ష్యంగా నంద్యాలలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం గతంలో పలు యంత్రాలు తయారు చేసింది. పంటల సాగులో రైతులకు ఉపయోగపడే యంత్రాల ఆవిష్కరణే లక్ష్యంగా ఇక్కడ నిత్యం పరిశోధనలు జరిగేవి. జీరోటిల్ డ్రిల్, కంబైన్డ్ హార్వెస్టర్, శనగ కోత, పత్తి తీసిన తర్వాత చెట్లు తొలగించేది, కడ్డి కత్తిరించేది, ఎరువులు వెదజల్లే యంత్రాలు ఇతర పరికరాలను గతంలో ఇక్కడ తయారు చేశారు. చిన్న ట్రాక్టర్లకు అనుసంధానం చేసే యంత్రాలు రూపొందించినందుకు గాను గతంలో జాతీయ పురస్కారం సైతం లభించింది. ప్రస్తుతం ఇక్కడ కొత్త యంత్రాల ఆవిష్కరణ అటకెక్కింది. వ్యవసాయ ఇంజినీరింగ్ విభాగంలో ఐదేళ్లుగా శాస్త్రవేత్త లేకపోవడంతో పరిశోధనలు జరగడం లేదు. గతంలో ఉన్నవారు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ శాస్త్రవేత్తను నియమించి.. నూతన యంత్రాల తయారీపై దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

గనుల సొమ్ము లెక్క ఇక పక్కా

■ 'ప్రైవేటు'కు సీనరేజి వసూలు బాధ్యత
■ దోపిడీ కట్టడికి కూటమి ప్రభుత్వం చర్యలు
■ నెలాఖరులోగా టెండర్ల నిర్వహణ



బనగానపల్లి ప్రాంతంలో నాపరాయి గని

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : గనుల నిర్వాహకులు తవ్విన ఖనిజాలకు సంబంధించి సీనరేజి వసూలు బాధ్యతను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో ప్రైవేటు సంస్థలే ఈ సీనరేజి వసూలు చేస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలోనే ఈ విధానం అమల్లోకి వచ్చినా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలు చేయలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధానం ఉండాలన్న ఉద్దేశంతో మిగిలిన జిల్లాల్లో కూడా సీనరేజి వసూలు బాధ్యతను ప్రైవేటు సంస్థలకు అప్పగించనుంది.

యథేచ్ఛగా గ్రానైట్ దోపిడీ

గత కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో కొంతమంది గ్రానైట్ గనుల లీజుదారులు, గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ యూనిట్ల నిర్వాహకులు సరైన పర్మిట్లు లేకుండానే భారీగా ఖనిజాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారు. బిల్లులు లేకుండానే తరలిస్తున్నారు. గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో కొంతమంది నాయకులతో పోలీసు, రెవెన్యూ, మైనింగ్, విజిలెన్సు శాఖల అధికారులు చేతులు కలిపి పెద్దఎత్తున గ్రానైట్‌ను అక్రమ మార్గంలో పొరుగు రాష్ట్రాలకు తరలించారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు పెద్ద ఎత్తున గండిపడింది. ఈ పరిస్థితుల్లో అక్రమాల కట్టడి కోసం ఉమ్మడి జిల్లాలో సీనరేజి వసూలు బాధ్యతను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చింది.

గుత్త మొత్తంపై నెలనెలా సమీక్ష

జిల్లాలో సీనరేజి వసూళ్లకు త్వరలో టెండర్లు పిలిచేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో టెండర్లు పిలిచినా గుత్తేదారులు ముందుకు రాలేదు. టెండర్లలో పేర్కొన్న సొమ్ము ఎక్కువగా ఉండటంతో గుత్తేదారులు ఆసక్తి కనబరచలేదు. దీంతో ప్రస్తుత ప్రభుత్వం ప్రతినెలా గుత్తేదారులు చెల్లించాల్సిన మొత్తాన్ని సమీక్షించి కొద్దిపాటి మార్పులు చేయాలని నిర్ణయించింది. ఈ నెలలోనే టెండర్లు నిర్వహించేందుకు గనుల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పలువురు డీడీలు, ఏడీలతో ఒక కమిటీ ఏర్పాటు చేసి అభిప్రాయాలు సేకరించారు.

అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా..

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో నాపరాయి, గ్రానైట్, క్వార్ట్జ్ గనులు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. నంద్యాల జిల్లాలోని డోన్, బనగానపల్లి నియోజకవర్గాల్లో 200 వరకు నాపరాయి గనులు ఉన్నాయి. బనగానపల్లి, బేతంచెర్ల, కొలిమిగుండ్ల, అవుకు మండలాల పరిధిలో ఈ గనులు విస్తారంగా ఉన్నాయి. గ్రానైట్ గనులు నంద్యాల జిల్లా డోన్ ప్రాంతంలో 15, కర్నూలు జిల్లాలోని ఆదోని ప్రాంతంలో 15 ఉన్నాయి. క్వార్ట్జ్ గనులు నంద్యాల జిల్లాలో 6 ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 4 ఉన్నాయి. ప్రస్తుతం ఈ గనులకు సంబంధించి సీనరేజి వసూళ్ల బాధ్యతను ప్రైవేటు సంస్థలకు అప్పగించనున్నారు.

- గత ఐదేళ్లుగా గనుల శాఖ అధికారులు లీజు ప్రాంతాల్లో తనిఖీలకు తిలోదకాలిచ్చారు. గుత్తేదారు సంస్థలు కోరినట్లు పర్మిట్లు జారీ చేశారు. దీంతో వారు ఇష్టానుసారం సహజ వనరులను కొల్లగొట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గనుల శాఖ ద్వారా ఆన్‌లైన్‌లో పర్మిట్ల జారీ చేయడంతో పాటు తనిఖీలు, పర్యవేక్షణ పకడ్బందీగా ఉండాలని ఆదేశించింది. ప్రతినెలా గుత్తేదారులే సొమ్ము చెల్లించేలా మార్పులు చేసింది.

అవుకు కాల్వల అధోగతి

■ నిధులివ్వని గత ప్రభుత్వం
■ చేనుకు చేరని నీరు

చెంతనే నీరున్నా చేనుకు చేరని పరిస్థితి బనగానపల్లి నియోజకవర్గంలో నెలకొంది. అవుకు రిజర్వాయర్ పరిధిలో పంట కాల్వలు బాగా లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.. రూ.2 కోట్ల ప్రతిపాదనలతో అధికారులు నివేదిక పంపించినా గత వైకాపా ప్రభుత్వం స్పందించలేదు. నాలుగు టీఎంసీలు నిల్వ ఉండేలా రూ.110 కోట్లు వెచ్చించి పదేళ్ల కిందట అవుకు రిజర్వాయర్‌ను నిర్మించారు. ఇందులో మూడు టీఎంసీలు వైఎస్సార్ జిల్లాకు పంపిస్తుండగా 1 టీఎంసీ నీటిని జిల్లా రైతులకు అందిస్తున్నారు. సాధారణంగా 1 టీఎంసీ నీటితో పదివేల ఎకరాల్లో పంటలు పండించొచ్చు. కానీ ఆ స్థాయిలో సాగుకావడం లేదు.. ఇందుకు ప్రధాన కారణం పంట కాల్వలు బాగాలేకపోవడమే.

బనగానపల్లి, అవుకు, న్యూస్‌టుడే:



చెదిరిపోయిన పంట కాల్వలు

అవుకు రిజర్వాయర్ పరిధిలో 25 కి.మీ పంట కాల్వలు విస్తరించి ఉన్నాయి. అవుకు, ఓబుళాపురం, గుండ్లశింగవరం, నిచ్చెనమెట్ల, అన్నవరం, చిన్నకొట్టాల, పెద్దకొట్టాల, వేములపాడు, చెన్నంపల్లె, శివవరం, సంజామల మండలంలోని కొన్ని గ్రామాలకు సాగు నీరు అందించాలి. తూముల ద్వారా నీటిని విడుదల చేసినప్పుడు పొలానికి నీరు చేరాలి.. ఇక్కడ ఆ పరిస్థితి లేదు.. దిగువకు వెళ్లడం లేదు.. కాల్వలన్నీ ఎక్కడికక్కడ చెదిరిపోయాయి. కొన్నిచోట్ల ఆనవాళ్లే కోల్పోయాయి. రూ.కోట్లు ఖర్చు పెట్టి రిజర్వాయరు నిర్మించినా పంట కాల్వలు బాగు చేయలేదు.


ఏళ్ల నుంచి అవస్థలు : శ్రీరాములు

పంట కాల్వలు చెదిరిపోవడంతో పొలాలకు నీరు చేరడం లేదు. చి'వరి' ఆయకట్టురైతులు ఇబ్బంది పడుతున్నారు. కాల్వలపై వెళ్లడానికీ వీలులేకుండా ఛిద్రమయ్యాయి.. రెండేళ్ల కిందట రైతులంతా కలిసి రూ.2 లక్షలు పోగు చేసి బాగు చేయించుకొన్నాం. పంట ఉత్పత్తులు ఇంటికి తీసుకెళ్లడానికి కష్టాంగా ఉంది. అధికారులు స్పందించి పంట కాల్వలు, ఆయకట్టు రోడ్లను బాగు చేయాలి.

ప్రతిపాదనలు పంపించాం

–సురేష్ కుమార్, ఈఈ

అవుకు రిజర్వాయర్ కింద పంట కాల్వ నిర్మాణానికి సుమారు రూ.2 కోట్లు అవసరమని గతంలో ప్రతిపాదనలు పంపించాం. ఈ విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. నిధులొచ్చిన వెంటనే మరమ్మతులు చేస్తాం.



రతన్ టాటాకు అక్షరాంజలి

పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటాకు నంద్యాలకు చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేశ్ అక్షరాంజలి ఘటించారు. ఏ3 డ్రాయింగ్ ఛార్టు మీద ఎటువంటి గీతలు లేకుండా రతన్‌టాటా జీవిత చరిత్ర, ఆయన నాయకత్వంలో టాటా గ్రూపు కంపెనీలు సాధించిన విజయాలను తెలుగు, ఆంగ్లంలో ఆయన రూపం వచ్చేలా రాశారు. – నంద్యాల పాతపట్టణం

మద్యం టెండర్లకు నేటితో ఆఖరి గడువు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : మద్యం దుకాణాల టెండర్ల దాఖలుకు శుక్రవారంతో గడువు ముగుస్తుందని ఆబ్కారీ శాఖ సూపరింటెండెంట్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లాలో 105 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 1,627 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. 11వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో 14వ తేదీన లాటరీ తీస్తారన్నారు.

టెట్‌కు 16 మంది గైర్హాజరు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 16 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో 2 సుబ్రహ్మణ్యం తెలిపారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలోని శిల్పానగర్‌కు చెందిన కౌలురైతు సురేశ్‌రెడ్డి అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామీణ సీఐ అస్రర్‌బాషా గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. కొన్నేళ్ల నుంచి సురేశ్‌రెడ్డి కోవెలకుంట్ల మండలం జోలదరాశి గ్రామంలో ఏడెకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేసేవారు. పంటలు సరిగా పండక అప్పులు పెరిగిపోయాయి. ఇటీవల రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో అప్పు తీర్చే మార్గంలేక మనస్తాపం చెందిన ఆయన బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పంకాకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయనకు భార్య సుకన్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

కనులకు పండగే!

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాలు అహోబిలంలో వైభవంగా సాగుతున్నాయి. గురువారం ఉత్సవాల్లో భాగంగా అద్దాల మండపంలో ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి, అమృతవల్లిని పంచామృతాలతో తిరుమంజనం జరిపారు. వేద


స్వామి, అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

మంత్రాలతో అర్చకులు ధూపదీపాలతో మహా మంగళహారతి అందించారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం విశేష అలంకరణలో స్వామి, అమ్మవారు పల్లకిపై తిరువీధిలో విహరించారు. రాత్రి వేదప్రబంధపారాయణాలు పఠించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిపారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం నందవరం చౌడేశ్వరి అమ్మవారు మహాగౌరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించారు.


చండీహోమంలో భక్తులు

ప్రతివారం 1.5 లక్షల పని దినాలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఉపాధి హామీ పథకం కింద ప్రతివారం కూలీలకు 1.5 లక్షల పనిదినాలు కల్పించాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్‌లో గురువారం ఆమె ఉపాధిహామీ పథకం కింద నిర్దేశించిన లేబర్ బడ్జెట్,


సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

మొక్కల పెంపకం, పంట కుంటలు తదితర పనుల లక్ష్యాలపై డ్వామా పీడీ జనార్దన్‌రావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్లస్టర్ల వారీగా సమీక్షించారు. లక్ష్యాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. వెలుగోడు, జూపాడుబంగ్లా, పగిడ్యాల, బనగానపల్లి, సంజామల, నంద్యాల, ఉయ్యాలవాడ, చాగలమర్రి, గడివేముల మండలాల్లో కూలీల హాజరు చాలా తక్కువగా ఉందన్నారు. వచ్చే వారానికి కూలీల సంఖ్య పెంచకపోతే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 14 నుంచి నిర్వహించనున్న పల్లె పండుగ వారోత్సవాల్లో జిల్లా వ్యాప్తంగా మంజూరు చేసిన 1026 పనులను స్థానిక ప్రజా ప్రతినిధులతో ప్రారంభించాలన్నారు.

ఉపాధికి అడుగులు.. జీవితాల్లో వెలుగులు

☛ వీధి వ్యాపారులకు పీఎం స్వానిధి వరం

☛ వ్యక్తిగత, బ్యాంకులింకేజీ రుణాలతో ప్రగతి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పురపాలికల్లోని మహిళలు ఆత్మవిశ్వాసంతో బతకడానికి పీఎం స్వానిధి వరంగా మారుతోంది. సొంత వ్యాపారం చేసుకుని ఆర్థిక ప్రగతిని సాధించాలనుకునే వారికి పీఎం వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి(పీఎం స్వానిధి) తోడుగా నిలుస్తోంది. వీధి వ్యాపారులకు ఎలాంటి హామీ లేకుండా రూ. 50వేల వరకు రుణాలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. మెప్మా ద్వారా పొదుపు మహిళలు, వీధి వ్యాపారులు బ్యాంకుల ద్వారా రుణాలు పొందుతూ ఆర్థికప్రగతిని సాధిస్తున్నారు. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ద్వారా మహిళలకు ఉపాధి కల్పించి ఆర్థిక పురోభివృద్ధి చెందేలా కూటమి కూడా చర్యలు చేపట్టింది. 2024-25 ఏడాదికి సంబంధించి రుణాలను మంజూరు చేయనుంది. ఆయా లక్ష్యాలను ఇప్పటికే మెప్మా అధికారులు


స్వయం సహాయక సంఘాల మహిళల సమావేశం

నిర్దేశించగా, జిల్లాలోని నంద్యాల, డోన్, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు పురపాలికలతో పాటు బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలో 11 వేల స్వయం సహాయక సంఘాల్లోని 1,10,000 మంది సభ్యులు ప్రయోజనం పొందన్నారు. వారికి బ్యాంకు లింకేజీ ద్వారా 2024-25 ఏడాదిలో 1,111 స్వయం సహాయక సంఘాలకు రూ.40 కోట్లు వరకు రుణాలు ఇవ్వాలని లక్ష్యాలను నిర్దేశించారు. స్వయం ఉపాధి కింద వ్యక్తిగత రుణాలను 146 మంది సభ్యులకు గానూ రూ.1.32 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. పీఎం వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి (పీఎం స్వనిధి) కింద 16,505 మందికి గాను 2,106 మందికి రుణాలు ఇచ్చేందుకు పరిశీలిస్తున్నారు.

బ్యాంకు లింకేజీ రుణ వితరణ (రూ.లక్షల్లో)

పురపాలికలు	సంఘాలు లక్ష్యం	రుణాల లక్ష్యం	సంఘాలు పొందింది	వ్యక్తిగత రుణాలు (ఇచ్చింది)
ఆళ్లగడ్డ	132	480.00	165	1888.00
ఆత్మకూరు	110	400.00	168	1358.90
బేతంచెర్ల	55	200.00	147	1372.80
డోన్	132	480.00	199	1929.75
నందికొట్కూరు	242	880.00	220	2545.50
నంద్యాల	440	1600,00	669	7781.95

స్వయం ఉపాధి కింద (వ్యక్తిగత రుణాలు)

	సంఘాల లక్ష్యం	రుణాల లక్ష్యం	పొందిన సభ్యులు	పొందిన రుణాలు
ఆళ్లగడ్డ	22	20.00	22	12.00
ఆత్మకూరు	22	20.00	01	1.00
బేతంచెర్ల	03	2.00	00	0.00
డోన్	22	20.00	22	22.00
నందికొట్కూరు	22	20.00	22	31.50
నంద్యాల	55	50.00	38	60.70

పీఎం వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి (పీఎం స్వానిధి) కింద..

పురపాలికలు	ప్రాసెస్‌లో ఉన్నవి	పంపిణీ చేసింది	పెండింగ్‌లో ఉన్నవి
ఆళ్లగడ్డ	2,574	2,163	411
ఆత్మకూరు	1,859	1,494	365
బేతంచెర్ల	02	02	-----
డోన్‌లో..	2,435	2,104	331
నందికొట్కూరు	2,601	2,280	321
నంద్యాల	7,034	6,356	678

కుటుంబానికి ఆసరా



మెప్మా కింద బ్యాంకులో గ్రూపు తరపున రూ. లక్ష రుణం తీసుకుని దుస్తుల దుకాణాన్ని నిర్వహిస్తున్నాను. ఇంటిపట్టున ఖాళీగా కూర్చోకుండా కాస్తోకూస్తో సంపాదిస్తే కుటుంబానికి ఆసరాగా ఉండొచ్చనే భావనతో దుస్తుల దుకాణాన్ని నిర్వహిస్తున్నాను. ఇంటి అవసరాలు తీర్చుకోవడంతో పాటు కొంత పోగుచేసుకుంటున్నాను. వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటూ నెలకు రూ.8 వేల వరకు సంపాదిస్తున్నాను. ఇద్దరు కుమారులు షేక్ షంసుద్దీన్, షేక్షావలిలను చదివిస్తున్నాను.

-పి.ఫరీదాభీ, కొత్త ఇందిరానగర్, డోన్.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ విజేత వైజాగ్

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన 53వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఛాంపియన్ విజేతగా వైజాగ్ జట్టు నిలి


వైజాగ్ జట్టుకు కప్పు అందజేస్తున్న దాతలు

చింది. గురువారం విశాఖ, పశ్చిమగోదావరి జిల్లాల జట్లు ఫైనల్ పోటీల్లో తలపడ్డాయి. మూడు పాయింట్ల ఆధిక్యంతో పశ్చిమగోదావరిపై విశాఖ జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. పశ్చిమగోదావరి రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. మూడోస్థానంలో ఉమ్మడి విజేతగా కర్నూలు, సత్యసాయి జిల్లా జట్లను ప్రకటించారు. విజేతలకు దాతలు చక్రంబీడీ షబ్బీర్, ఇంతియాజ్, కేజర్, ప్రధానోపాధ్యాయులు కోటయ్య తదితరులు జ్ఞాపికలను అందజేశారు. రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కార్యనిర్వాహక కార్యదర్శి రామాంజనేయులు, పీడీ దాదాపీర్, పాల్గొన్నారు.

డ్రోన్‌ల సాయంతో గాలింపు

అవుకు, న్యూస్‌టుడే: కాలువ నీటిలో పడిపోయిన విద్యార్థి ఆచూకీకి అవుకు పోలీసులు గురువారం డ్రోన్ సాయంతో గాలింపు చేపట్టారు. బనగానపల్లి మండలం యాగంటి పల్లెకు చెందిన మధుకౌషి (10) గత సోమవారం బనగానపల్లి సమీపంలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు గాలేరు-నగరి కాల్వలో పడిపోయారు. .మూడు రోజులు గడిచినా ఆచూకీ లభించకపోడంతో అవుకు ఎస్సై రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు డ్రోన్లను ఉపయోగించి గాలేరు కాలువ వెంట పరిశీలిస్తూ అవుకు జలాశయంలో గాలింపు చేపట్టారు. బాలుడి ఆచూకీ లభించే వరకు గాలింపు కొనసాగుతుందని ఎస్సై తెలిపారు.

వరద బాధితులకు వస్త్ర వ్యాపారుల విరాళం

డోన్, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల కోసం డోన్‌కు చెందిన పలువురు వస్త్ర వ్యాపారులు రూ.40వేలను డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి గురువారం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి


కోట్లకు వరదసాయం అందిస్తున్న వస్త్రవ్యాపారులు

వెళ్లి ఆయనకు అందజేసి మాట్లాడారు. శీతల్ డ్రెస్సెస్, మా గార్మెంట్సు, చంద్రాస్ మెన్స్‌వేర్, మారుతి డ్రెస్సెస్, సుదర్శన్ గార్మెంట్సు యజమానులు పాల్గొన్నారు.

దేవస్థానానికి ట్రాక్టర్ విరాళం

మహానంది న్యూస్‌టుడే : మహానంది దేవస్థానానికి పనుల నిమిత్తం నంద్యాల స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ వారు రూ.10.50 లక్షలు విలువచేసే మహీంద్ర ట్రాక్టర్‌ను గురువారం విరాళంగా అందజేసినట్లు దేవస్థానం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు


ఈవోకు ట్రాక్టర్ తాళం అందజేస్తున్న ఎస్బీఐ బ్యాంక్ అధికారులు

పోక్సో కేసు నమోదు

వెలుగోడు, న్యూస్‌టుడే : మండలంలోని మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆరు సంవత్సరాల చిన్నారిపై అదే గ్రామానికి 15ఏళ్ల బాలుడు ఈ నెల ఒకటో తేదీన అత్యాచారానికి పాల్పడ్డారని చిన్నారి తల్లిదండ్రులు బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కి తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

పొరుగు రాష్ట్రంలో కొలువు పట్టారు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: కృషి పట్టుదల ఉంటే ఎక్కడైనా విజయాన్ని సాధించవచ్చు. వైకాపా ఐదేళ్ల పాలనలో డీఎడ్, బీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఉద్యోగ ప్రకటన కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూశారు. ఏళ్లు గడిచినా ఉద్యోగ ప్రకటన విడుదల కాకపోవడంతో తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనయ్యారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు మాత్రం కొద్దిపాటి పోస్టులకు ప్రకటనలు ఇచ్చి మమ అనిపించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రంలోనూ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఆంధ్రా కన్నా ముందుగానే పరీక్షలు నిర్వహించారు. ఓపెన్ కేటగిరిలో తమ భవితవ్యాన్ని పరీక్షించుకునేందుకు ఆత్మకూరుకి చెందిన ముగ్గురు విద్యార్థులు పరీక్షలు రాసి విజయం సాధించారు. ఆ విద్యార్థుల విజయ ప్రస్థానంపై న్యూస్‌టుడే కథనం

వయస్సు తక్కువగా ఉండటంతో పోస్టు పోయింది



మాది కురుకుంద గ్రామం. నేను ఇంటర్‌లో ఉన్నప్పుడే నాన్న చనిపోయారు. అమ్మ కూలి పనులు చేసుకుంటూ ఎంతో కష్టపడి నన్ను చదివించింది. 2018లో ఆంధ్రాలో డీఎస్సీ రాశాను. 70.8 కటాఫ్ మార్కులు ఐదుగురికి రాగా నలుగురికి పోస్టులు వచ్చాయి. నాలుగు, ఐదు స్థానాల్లో ఇద్దరం పోటీ పడ్డాము. నా వయస్సు తక్కువగా ఉండటంతో పోస్టు పోయింది. స్థానిక ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తూ ఓ స్టడి సర్కిల్‌లో ఐదేళ్లుగా శిక్షణ తీసుకున్నాను. పాఠశాలలో నాకు బోధించే ఉపాధ్యాయులను చూసి నేను చిన్నప్పుడే టీచర్ కావాలని నిర్ణయించుకున్నాను. హైద్రాబాద్ జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 80 పోస్టులుండగా నాన్ లోకల్‌కి 4 పోస్టులున్నాయి. జిల్లాలో మూడో ర్యాంకు వచ్చినప్పటికి ఓపెన్ కేటగిరి నాన్ లోకల్‌లో నేను మొదటి స్థానంలో నిలిచినందుకు చాలా సంతోషంగా ఉంది.

– ఎస్‌హెచ్ గౌసియ కురుకుంద

చిన్నప్పుడే నిర్ణయించుకొన్నాను



మాది నిరుపేద కుటుంబం. నాన్న గోనె సంచుల వ్యాపారం చేస్తారు. జగిత్యాల జిల్లాలో ఉర్దూ ఎస్జీటీలో మూడో ర్యాంక్ సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది. ఓపెన్ కేటగిరిలో 6 పోస్టులుండగా అందులో నాన్ లోకల్‌కి ఒక పోస్టు ఉంది. పాఠశాల స్థాయిలోనే మా ఉపాధ్యాయులు నన్ను ఎంతగానో ప్రోత్సహించేవారు. అప్పటి నుంచే నేను టీచర్ కావాలని నిర్ణయించుకున్నాను. ఆంధ్రా డీఎస్సీకి ప్రాక్టీస్‌గా ఉంటుందని తెలంగాణ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. నాన్ లోకల్‌లో ఉద్యోగం సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది.

– మైమూన్ ఆత్మకూరు



ఉర్దూ ఉపాధ్యాయునిగా సేవా చేయాలని..

మాది ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామం. నాన్న కార్పెంటర్‌గా పనిచేస్తున్నారు. మాది నిరుపేద కుటుంబం. 2012లో గ్రామంలో ఉర్దూ ఉన్నత పాఠశాల ఏర్పాటైంది. అప్పటి నుంచి 2022 వరకు ఈ పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయుల్లేరు. 2022లో ఉర్దూ మాధ్యమం తీసేశారు. తెలుగు మాధ్యమం విద్యార్థులతో పోటీ పడి చదివాము. అప్పటి నుంచి ఉర్దూ మాధ్యమంలో ఉపాధ్యాయునిగా సేవా చేయాలని నిశ్చయించుకున్నాను. నిజామాబాద్ జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 22 పోస్టులు ఉండగా అందులో నాన్ లోకల్ పోస్టు ఒక్కటే ఉంది. ఉర్దూ ఎస్జీటీ విభాగంలో జిల్లా మొదటి ర్యాంక్ సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది. అక్కడ విధులు నిర్వహిస్తూనే ఆంధ్రా డీఎస్సీకి పోటీ పడుతాను.

– బషిరూన్

పెద్ద పులిరాజుపై సస్పెన్షన్ వేటు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం, నిర్లక్ష్యంగా కారణంగా ఆత్మకూరు సహకార బ్రాంచి మేనేజర్ పెద్ద పులిరాజుపై సస్పెన్షన్ వేటు పడింది. సహకార బ్రాంచిలో కొన్ని నెలలుగా నిధులు స్వాహా అవుతున్నా పట్టించుకోకపోవడంతోపాటు విధుల పట్ల ఉదాసీనంగా వ్యహరించడంపై ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో ఆయన్ని సస్పెండ్ చేశారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆత్మకూరు బ్రాంచిలో ఇటీవల వెలుగు చూసిన రూ.78.77 కోట్ల కుంభకోణంలో ముగ్గురు ఉద్యోగులపై క్రిమినల్ కేసులు నమోదైన విషయం విదితమే. క్యాషియర్ అల్తాఫ్ (ఎ1) నిధులను తన సొంత అవసరాలకు, వ్యాపారానికి మళ్లించడం, ఈ అక్రమాలను చూసీచూడనట్లుగా వ్యవహరించిన పాసింగ్ ఆఫీసర్ వెంకటరంగయ్య (ఎ2), కొన్ని నెలలుగా నిధులు పక్కదారి పట్టినా పట్టించుకోని బ్రాంచి మేనేజర్ పెద్ద పులిరాజు (ఎ3)పై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. 8వ తేదీన ఆత్మకూరు బ్రాంచిలో ముగ్గురు ఉద్యోగులపై క్రిమినల్ కేసులు నమోదు కాగా, 9న వెలుగోడు బ్రాంచి మేనేజర్ నారాయణరెడ్డి, 10వ తేదీన ఆత్మకూరు బ్రాంచి మేనేజర్ పెద్ద పులిరాజులపై సస్పెన్షన్ వేటు పడింది. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకును బ్యాంకు ఉద్యోగులే నాశనం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొలువు ఇచ్చిన బ్యాంకుకే కన్నం వేస్తున్నారు. నెలనెలా వేతనాలు తీసుకుంటూ బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బ్యాంకు ఉద్యోగులే అక్రమ మార్గాల్లో బ్యాంకు నిధులు కొల్లగొడుతున్నారు. బ్యాంకు కార్యకలాపాలు ఎలా జరుగుతున్నాయి, ఉమ్మడి జిల్లాలో బ్యాంకు బ్రాంచీల్లో ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. రైతుల బ్యాంకును ఉద్యోగులే నాశనం చేస్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేసే పరిస్థితి నెలకొంది.

ముగిసిన జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు


బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన తెలంగాణ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రముఖులు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలో నిర్వహించిన 42వ జాతీయస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీలు గురువారం ముగిశాయి. స్థానిక గురురాజ పాఠశాల ఆవరణలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఏఎస్పీ యుగంధర్‌బాబు, రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డా.రామకృష్ణారెడ్డి, గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత డా.దస్తగిరిరెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ, జాతీయ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మౌర్య విజేత జట్లకు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. బాలుర విభాగంలో మహారాష్ట్ర, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో తెలంగాణ ప్రథమ, పంజాబ్ ద్వితీయ, మధ్యప్రదేశ్ జట్టు తృతీయ స్థానంలో నిలిచినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు వెల్లడించారు. క్రీడాకారులకు వసతులు కల్పించిన గురు రాఘవేంద్ర బ్యాంక్ శిక్షణ కేంద్రం, రామకృష్ణ విద్యా సంస్థల అధినేతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

వైకాపా నేతల నిర్వాకంతోనే ముగ్గురు ఐపీఎస్‌ల సస్పెన్షన్

-భూమా అఖిలప్రియ, ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వ హయాంలో పోలీసుల పనితీరును జిల్లా వైకాపా నాయకులు విమర్శించే ముందు..గత ప్రభుత్వ హయాంలో వైకాపా నాయకుల ఒత్తిళ్ల కారణంగానే ముగ్గురు ఐపీఎస్‌లు సస్పెండయ్యారనే విషయాన్ని మర్చిపోకూడదని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆళ్లగడ్డలో పోలీసులు అరాచకాలకు పాల్పడుతున్నారని వైకాపా నాయకులు నంద్యాలలో ఆరోపించారని, ఇక్కడి పోలీసుల వ్యవహారం సరిగా లేదని ఆరోపించే ముందు గత


భూమా అఖిలప్రియ

ప్రభుత్వ హయాంలో పోలీసుల తీరును గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో ఇష్టానుసారంగా పోస్టింగులు వేయించి తెదేపా నాయకులను పోలీసులు వేధించలేదా..? అని ఆమె ప్రశ్నించారు. నంద్యాల పరిధిలోని శిల్పా వెంచర్‌లో ఓ బాలికను మానభంగం చేసి హత్య చేసిన సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఈ వైకాపా నాయకులు ఎందుకు విమర్శించలేదని ఆమె ప్రశ్నించారు. ఆళ్లగడ్డ, నంద్యాలలో శిల్పా చక్రపాణి రెడ్డి ఎన్నో అక్రమాలకు పాల్పడుతూ మోసాలు చేస్తున్నా ఈ వైకాపా నాయకులు ఎందుకు నోరు విప్పడం లేదని ఆమె ప్రశ్నించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి మహిళ మృతి

కొత్తపల్లి న్యూస్‌టుడే : ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో ఓ మహిళ కిందపడి మృతిచెందిన ఘటన మండలంలోని కొత్తమాడుగు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై కేశవ తెలిపిన వివరాల ప్రకారం పాములపాడు గ్రామానికి చెందిన బొజ్జరా మేశ్వరి (45), సాయిబాబా భార్యభర్తలు. వీరిద్దరూ ద్విచక్రవాహనంపై మండలంలోని బట్టువారిపల్లి గ్రామ సమీపంలో ఉన్న వారి సొంత పొలాలను చూసేందుకు వెళుతుండగా మార్గమధ్యలో కొత్తమాడుగుల సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో రామేశ్వరి కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. మృతురాలి కుమారుడు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పరివాహన్.. పరేషాన్

☛ యాప్‌పై అవగాహన కల్పించడంలో విఫలం

☛ నిరక్షరాస్యులంతా లైసెన్సు పత్రాలకు మీసేవ కేంద్రాలకు పరుగులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లా వాహనదారులు వాహన పత్రాల కోసం ఎదురుచూడక తప్పడం లేదు. వాహనదారులకు నూతన యాప్‌పై అవగాహన కల్పించడంలో రవాణా శాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. కాగిత రహిత (పేపర్ లెస్) సేవలకు ప్రాధాన్యం ఇస్తూ కేంద్ర ప్రభుత్వం రవాణా శాఖకు సంబంధించిన వ్యవహారాలన్నీ 'పరివాహన్' యాప్‌లోకి తెచ్చింది. వాహన పత్రాల కోసం ప్రైవేట్ వ్యక్తులు నిర్వహించే కేంద్రాల వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పరివాహన్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. తనిఖీల సమయంలో పోలీసులకు పత్రాలు చూపించాల్సి రావడంతో ఉచితంగా ఇవ్వాల్సిన పత్రాలు డబ్బులు పెట్టి తీసుకోవాల్సి రావడం గమనార్హం. కాగిత రహిత పత్రాలు తీసుకు రావడమే లక్ష్యంగా 2019లో కేంద్ర రవాణా శాఖ పరివాహన్ యాప్, వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ వెబ్‌సైట్‌లో రవాణా శాఖకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్, లెర్నింగ్, రిజిస్ట్రేషన్, చిరునామా మార్పు వంటి సుమారు 16 రకాల సేవలు ఉంచారు. వాహనదారుడు రవాణా శాఖకు చెందిన రుసుము ఇందులో చెల్లించాలి. ఆ తర్వాత అభ్యర్థి దరఖాస్తు వాహన యాప్ నుంచి ప్రింట్ తీసుకుని పరీక్ష దగ్గర నుంచి రిజిస్ట్రేషన్ వరకు రవాణా


జిల్లా రవాణా కార్యాలయం

కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. రవాణా కార్యాలయంలో పత్రాలు చూపించిన తర్వాత పరిశీలన కోసం చరవాణి నంబరుకు వచ్చే ఓటీపీ ద్వారా అధికారులు ధ్రువీకరించి తదుపరి పనులు ప్రారంభిస్తారు. వాహన లైసెన్సు నుంచి రిజిస్ట్రేషన్ పత్రాలకు చెల్లించే వాటిలో పత్రాల రుసుము కూడా వాహనదారులు చెల్లిస్తారు కాబట్టి, రవాణా శాఖ ఉచితంగా పత్రాలను ప్రింట్ చేసి ఇవ్వాలి. కాగితాలు లేని కారణంగా రవాణా శాఖ అధికారులు మళ్లీ మీసేవా కేంద్రాలకు పంపుతున్నారు.

వాహనదారుల నుంచి వసూలు

రవాణా శాఖలో లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్సు పాసైన తర్వాత చరవాణికి మెసేజ్ రావడంతో మీసేవా కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఉచితంగా ఇవ్వాల్సిన లెర్నింగ్ లైసెన్సు జిరాక్సు కాగితాన్ని కేంద్రాల నిర్వాహకులు రూ.10 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తున్నారు. అదే లైసెన్సు అయితే డౌన్‌లోడ్ చేసినందుకుగాను రూ.20, కార్డు రూపంలో ప్రింట్ కావాలంటే మరో రూ.100 వసూలు చేస్తున్నారు. యాప్‌లో వెళ్లాలంటే www.parivahan.nic.gov.inలో లాగిన్ కావాలి. సీనియర్ సిటిజన్‌లోని వెళ్తే సంబంధిత సేవలుంటాయి. అక్కడే రుసుము చెల్లించాలి.

అధిక భాగం నిరక్షరాస్యులే..

టూ వీలర్, ఫోర్ వీలర్‌కు వచ్చే వాహనదారుల నుంచి ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ ఆటో, హెవీ వాహన డ్రైవింగ్‌కు వచ్చే వారిలో అధిక భాగం నిరక్షరాస్యులే ఉంటున్నారు. ప్రతి రోజూ వాహనాల డ్రైవింగ్ లైసెన్సు కోసం వచ్చేవారు 50 మంది వరకు ఉంటే.. అందులో ఆటోడ్రైవర్లు 10, లారీ డ్రైవర్లు 15, మెకానికులు 10 మంది వరకు ఉండటం గమనార్హం. కేవలం 20 మంది మాత్రమే వాహన పత్రాలను డౌన్‌లోడ్ చేసుకునే అవగాహన ఉంటే.. మిగితావారు మీ సేవా కేంద్రాలకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రింట్ వచ్చేలా చేయాలి: రమేశ్, ఆటోడ్రైవర్

డ్రైవింగ్ లైసెన్సు కోసం రవాణా శాఖ కార్యాలయంలో పరీక్ష పూర్తయిన తర్వాత పాసైయ్యామని చెబుతున్నారు. మీసేవా కేంద్రాలకు వెళ్లి తీసుకోమని సిబ్బంది చెబుతున్నారు. డ్రైవింగ్ లైసెన్సును ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలో తెలియదు. వీటిపై రవాణా శాఖ అధికారులు కేంద్రం ఏర్పాటు చేసి వారే ప్రింట్ తీసి ఇస్తే బాగుంటుంది.

స్వీయ సంరక్షణకు ప్రాధాన్యమివ్వండి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : పని సమయంలో విరామం, విశ్రాంతి తీసుకుని స్వీయ సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఒత్తిడిని తగ్గించుకునేందుకు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. ప్రస్తుతం మానసిక సమస్యలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డా.కాంతారావు, ఆరోగ్య విద్యాబోధకులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

మల్లన్న సేవలో రాష్ట్ర మంత్రులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లను రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం రాత్రి దర్శించుకున్నారు. శ్రీశైలం వచ్చిన వారికి దేవస్థానం ఈవో డి. పెద్దిరాజు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

ఆత్మకూరు పట్టణం : సమస్య : ఆర్టీసీ కాలనీలో మినీ ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. **- నాగన్న**

సమస్య : ఏకలవ్యనగర్ నుంచి అక్కిరాజుకాలనీకి వెళ్లే మార్గంలో వీధిదీపం వెలగడం లేదు. **- సుధాకర్**

సమాధానం : ట్యాంకు పరిసరాలు శుభ్రం చేయిస్తాం. వీధిదీపానికి మరమ్మతులు చేయిస్తాం. **- జీవన్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టరు, షాహీర్‌బాషా, పురపాలక ఏఈ**

పల్లె ముంగిట.. ప్రగతి పండగ

☛ రహదారులు, డ్రైనేజీల ఏర్పాటుకు నిధుల మంజూరు ☛ 14 నుంచి ప్రారంభం కానున్న పనులు


అధ్వానంగా పాములపాడు- ఎం.లింగాపురం రోడ్డు

నంద్యాల పట్టణం, రైతునగరం, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతి పూర్తిగా పడకేసింది. ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదు. మౌలిక వసతులు మచ్చుకైనా లేని పరిస్థితి దాపురించింది. రహదారులు అధ్వానంగా మారాయి. కాల్వల్లేక పల్లెల్లో ఎటుచూసినా మురుగు నిలుస్తోంది. చిన్నపాటి వర్షం పడినా రోడ్లపై నీరు పారుతోంది. ఏడాది పొడవునా తాగునీటి కష్టాలు వేధిస్తున్నాయి. వీధిదీపాలు వెలగక అవస్థలు తప్పడం లేదు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చే నిధుల్ని సైతం వైకాపా దారి మళ్లించడంతో చిన్న చిన్న మరమ్మతుల సైతం చేయించలేని దుస్థితి. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టింది. ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు పల్లె పండగ పేరుతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులతో శంకుస్థాపనలు చేయించేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

నియోజకవర్గం	పనులు	నిధులు రూ.కోట్లలో
నంద్యాల (గోస్పాడు)	103	7.80
పాణ్యం (గడివేముల)	71	5
శ్రీశైలం	164	12.12
నందికొట్కూరు	236	15.42


పాములపాడు మండలం మిట్టకందాలలో కాల్వల్లేక ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు

గ్రామసభలతో పనుల గుర్తింపు

జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఆగస్టు 23న గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పెండింగ్ పనులు, చేపట్టాల్సిన అభివృద్ధిపై అధికారులు ప్రజలతో చర్చించి సమష్టి నిర్ణయం తీసుకున్నారు. పనుల జాబితాల్లో మొదటి ప్రాధాన్యంగా రహదారులు, మురుగుకాల్వలు నిర్మించాలని నిర్ణయించారు. ఈ పనులను ఉపాధిహామీ నిధులతో చేపట్టనున్నారు. వచ్చే సంక్రాంతి నాటికి వీటిని పూర్తిచేసి మరో పండుగ నిర్వహించేలా ప్రభుత్వం అధికారులకు లక్ష్యాలు విధించింది.

గ్రామాల వారీగా నిధులు

★ నంద్యాల నియోజకవర్గంలో రూ. 7.80 కోట్లతో సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. నంద్యాల మండలంలోని 16 గ్రామాల్లో 38 కి.మీలు, గోస్పాడు మండలంలోని 14 పంచాయతీల్లో 23 కి.మీల పొడవునా రోడ్లు, కాల్వలు ఏర్పాటు చేయనున్నారు.

★ శ్రీశైలం నియోజకవర్గంలో రూ. 12.12 కోట్ల వ్యయంతో వివిధ పనులు చేపట్టనున్నారు. ఆత్మకూరు మండలంలోని 18 పంచాయతీల్లో 23 కి.మీ., వెలుగోడు మండలంలోని 16 గ్రామాల్లో 17 కి.మీలు, మహానంది మండలంలోని 13 గ్రామాల్లో 15 కి.మీ., బండి ఆత్మకూరు మండలంలోని 17 గ్రామాల్లో 27 కి.మీల పొడవున రహదారులు, కాల్వలు నిర్మించాలని ప్రణాళికలు తయారు చేశారు.

★ నందికొట్కూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు 15.42 కోట్ల నిధులు మంజూరయ్యాయి. నందికొట్కూరు మండలంలోని 17 గ్రామాల్లో 32 కి.మీలు, పాములపాడు మండలంలోని 14 గ్రామాల్లో 28 కి.మీలు, కొత్తపల్లి మండల పరిధిలోని 13 గ్రామాల్లో 21 కి.మీలు, మిడుతూరు పరిధిలోని 15 గ్రామాల్లో 22 కి.మీలు, జూపాడుబంగ్లా మండలంలోని 14 గ్రామాల్లో 23 కి.మీల చొప్పున పనులు చేయాలని నిర్ణయించారు.

★ పాణ్యం నియోజకవర్గంలోని గడివేముల, పాణ్యం మండలాలకు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేశారు. పాణ్యం 47, గడివేముల మండలంలో 24 పనులు చేపట్టనున్నారు.

ఈత సరదా.. జాగ్రత్త పట్టదా

దసరా సెలవుల్లో ఇంటి వద్దే ఉంటున్న పిల్లలు మధ్యాహ్నం వేళల్లో సమీప నీటి వనరుల్లో ఈతకు వెళుతున్నారు. ఈత రానివారు కూడా సరదాగా నీళ్లలో దిగుతున్నారు. మరికొందరు లోతు ఎక్కువ ఉన్న, ప్రవహించే నీటిలో ఈత కొడుతున్నారు. నంద్యాల పట్టణ శివారులోని పొన్నాపురం వద్ద ఉన్న కేసీ కాల్వలో రోజూ పలువురు బాలలు ఈతకు దిగుతున్నారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్నందున తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం



హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన సీఐ


న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నందికొట్కూరు సీఐ, ఎస్సై

పగిడ్యాల న్యూస్‌టుడే : హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్‌రెడ్డి పగిడ్యాల మండల పరిధిలోని తూర్పు ప్రాతకోట గ్రామంలోని స్వగృహానికి వచ్చారు. ఈసందర్భంగా నందికొట్కూరు గ్రామీణ సీఐ సుబ్రహ్మణ్యం, ముచ్చుమర్రి ఎస్సై శరత్‌కుమార్‌రెడ్డి గురువారం న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నిత్యావసరాల ధరలు నియంత్రించాలి



నంద్యాలలో గాంధీ విగ్రహం ఎదుట ఆందోళన

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : భారీగా పెరిగిన నిత్యావసర సరకుల ధరలను నియంత్రించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోట మద్దులు, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. నంద్యాల గాంధీచౌక్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట సీఐటీయూ నాయకులు గురువారం మెడలో కూరగాయల దండలు వేసుకొని వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజురోజుకు కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయన్నారు. సామాన్యులు కూరగాయలు, నిత్యావసర సరకులు కొనలేని పరిస్థితి నెలకొందన్నారు. నాయకులు వెంకటలింగం, సుబ్బారావు, జైలాన్, నరసింహ, బాలు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నిత్యావసర సరకుల ధరలు, కూరగాయల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు గడ్డి తింటూ నిరసన తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి పటేల్ కూడలిలో నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ ధరల పెరుగుదల వల్ల పండుగ సమయంలో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి నిత్యావసర, కూరగాయల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ, పాల్గొన్నారు.



నందికొట్కూరులో గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భాషోపాధ్యాయుని కుటుంబానికి ఆర్థిక సాయం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : అవుకు మండలం సంగపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఖలీల్ అహ్మద్ కుటుంబానికి భాషోపాధ్యాయ సంఘం ప్రతినిధులు గురువారం ఆర్థిక సాయం అందించారు. నంద్యాలలో నిర్వహిస్తున్న ఖలీల్ అహ్మద్ గత నెలలో అకాల మరణం పొందారు. ఉపాధ్యాయుల సహకారంతో సేకరించిన రూ. 46,500 నగదును వారు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కన్నయ్య, హుసేన్ మియా, నాయకులు రబ్బాని, లింగమయ్య, విశ్వనాథరెడ్డి, నబీషా, జాఫర్, సలీం, శ్రీనివాసరెడ్డి, నీలం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

సుడిదోమ నియంత్రణకు పొలాలు ఆరబెట్టాలి

బిల్లలాపురం (నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే : వరి పంటలో సుడి దోమ నియంత్రణకు పొలంలో నీటిని తొలగించి ఆరబెట్టాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు రైతులకు సూచించారు. మరుసటి రోజు నీరు పెట్టడం వల్ల సుడి దోమ ఉద్ధృతి తగ్గుతుందన్నారు. మండలంలోని బిల్లలాపురం గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులను వివరించారు.

వెలుగోడు, న్యూస్‌టుడే : వరి పంటలను సుడిదోమ అధికంగా ఆశించిందని, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని ఏవో పవన్‌కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని మోతుకూరు, బోయరేవుల గ్రామాల్లో గురువారం ఆయన వరిపొలాలు పరిశీలించారు. సస్యరక్షణ చర్యలు వివరించారు.

అమ్మవారికి భూమా పూజలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని బాల్కొండ హాల్, ఉప్పరిపేటలలో దసరా నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి గురువారం దర్శించుకుని పూజలు చేశారు. అక్కడ నిర్వహించిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు దుర్గాగౌడ్, సోమగాని గౌడ్, మంచాల విజయభాస్కర్‌రెడ్డి, గురునాథరెడ్డి, చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : దసరా శరన్నవ రాత్రులను పురస్కరించుకుని నంద్యాల పట్టణం నూనెపల్లెలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహం వద్ద గురువారం అన్నదానం చేశారు. 29వ వార్డు తెదేపా ఇన్‌ఛార్జి మంజుల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకుడు ఎన్‌ఎండీ ఫయాజ్ ప్రారంభించారు. భక్తులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో నాయకులు సంపంగి రామకృష్ణ, జయకృష్ణ, జి.వెంకటేశ్వర్లు, షేక్ మున్నా, వడ్డె జనార్దన్, మాజీ కౌన్సిలర్ సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్రీడా శాఖ మంత్రిని కలిసిన బాడీబిల్డర్ హాజీ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాలకు చెందిన బాడీబిల్డర్ హాజీ రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. దేశ, విదేశాల్లో ప్రతిభ చూపిన హాజీ గురువారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హాజీకి ప్రభుత్వం తరఫున ప్రోత్సాహం అందిస్తానని హామీ ఇచ్చారు.


మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో హాజీ

దత్తగిరి ఆశ్రమంలో పూర్ణాహుతి

శ్రీశైలం, న్యూస్‌టుడే : శ్రీశైలం మహాక్షేత్రంలో దసరా శరన్నవరాత్రుల మహోత్సవంలో భాగంగా పలు చోట్ల చండీహోమాలు, వేదపారాయణాలు, సుహాసిని పూజలు కుంకుమార్చనలు జరుగుతున్నాయి. గురువారం పాతాళగంగ రోడ్డులోని దత్తగిరి ఆశ్రమంలో చండీహోమం పూర్ణాహుతిలో దత్తగిరి స్వామి, తెలంగాణ ప్రముఖులు, శ్రీశైలం సీఐ ప్రసాద్‌రావు, దేవస్థానం అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు. అనంతరం దత్తగిరి ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు


13 నుంచి వాలీబాల్ పోటీలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : దసరా పండుగ సందర్భంగా ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో బాలురు, బాలికలకు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ, రైల్వే క్రీడాకారుడు నిమ్మకృష్ణయాదవ్, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఛైర్మన్ పస్పిల్‌మున్నా తెలిపారు. గురువారం ఆత్మకూరు స్టేడియంలో వాలీబాల్ టోర్నమెంట్ కరపత్రాలను విడుదల చేశారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు ప్రథమ రూ. 7016, ద్వితీయ రూ. 5016, తృతీయ రూ. 3016లు అందజేస్తామన్నారు.

విజయదుర్గా.. నమోస్తుతే


నంద్యాల గాంధీచౌక్ : దుర్గాదేవి అలంకారంలో నిమిషాంబ దేవి


నంద్యాల గాంధీచౌక్ : గిరినాథ్ సెంటర్‌లో దుర్గాదేవిగా అమ్మవారు


నంద్యాల గాంధీచౌక్ : సంజీవనగర్ కోదండ రామాలయంలో దుర్గాదేవిగా..


నంద్యాల గాంధీచౌక్ : బాలాజీ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో మహిషాసుర మర్దిని అలంకరణ


నంద్యాల గాంధీచౌక్ : లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు


గడివేముల : నవదుర్గల వేషధారణలో ఆర్యవైశ్య మహిళలు


నంద్యాల పట్టణం : హరిజనవాడలో అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రి ఫరూక్

దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం నియోజకవర్గాల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఎనిమిదో రోజు గురువారం పలు ఆలయాల్లో అమ్మవార్లు దుర్గాభవాని, మహిసాసుర మర్దిని, మహాగౌరి అలంకారాల్లో దర్శనమిచ్చారు. ఈసందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.
– న్యూస్‌టుడే, నంద్యాల క్లస్టరు బృందం


నందికొట్కూరు : చౌడేశ్వరీ దేవి ఆలయంలో..


మహానంది : మహాగౌరి అలంకరణలో కామేశ్వరీదేవి


ఆత్మకూరు : రాజరాజేశ్వరీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి


పాణ్యం గ్రామీణం : కన్యకా పరమేశ్వకి దుర్గా అలంకారం


బండిఆత్మకూరు : ఓంకారంలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు

సైబర్ నేరాలపై అప్రమత్తం

పాములపాడు న్యూస్‌టుడే : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. ఆయన గురువారం పాములపాడు ఎస్సై సురేశ్ ఆధ్వర్యంలో ఇస్కాల గ్రామంలో గ్రామసభను ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాలు, చట్టాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆత్మకూరు గ్రామీణ సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

బండి ఆత్మకూరు న్యూస్‌టుడే : ప్రజలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జగన్‌మోహన్ సూచించారు. మండలంలోని శింగవరం గ్రామంలో గురువారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మీ ఖాతాకు డబ్బు పంపించామని, ఓటీపీ చెప్పాలని గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్లు వస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

పగిడ్యాల, న్యూస్‌టుడే : రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమతంగా ఉండాలని నందికొట్కూరు గ్రామీణ సీఐ సుబ్రహ్మణ్యం, ముచ్చుమర్రి ఎస్సై శరత్ కుమార్‌రెడ్డి సూచించారు. పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామంలో గురువారం రాత్రి గ్రామసభ నిర్వహించారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930కు కాల్ చేయాలన్నారు.


అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

కంచెలేని ప్రమాదాలు

☛ గ్రామీణులను భయపెడుతున్న విద్యుత్తు నియంత్రికలు

పాణ్యం డొంగు వద్ద జాతీయ రహదారి పక్కనే దుకాణాల వద్ద విద్యుత్తు నియంత్రిక నేలకు సమాంతరంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ పంక్చర్ బంకు, హోటల్ ఉన్నాయి. దీంతో నిత్యం ఈ ప్రాంతంలో వాహనాలు నిలుపుతున్నారు. తక్కువ ఎత్తులో ఉన్న దీన్ని వాహనదారులు సకాలంలో గుర్తించలేక సమీపం వరకు వెళుతున్నారు. ఏమరపాటులో ఢీకొంటే ప్రాణాలకే ప్రమాదం.



పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఈ కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రజల ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పాణ్యం మండలంలో జనావాసాలు, ప్రధాన రహదారుల పక్కన తక్కువ ఎత్తులోనే నియంత్రికలు ఏర్పాటు చేశారు. వీటి చుట్టూ ఎలాంటి రక్షణ ఏర్పాట్లు చేయలేదు. కంచె గాని రక్షణ గోడ గాని నిర్మించలేదు. చాలాచోట్ల నియంత్రికలను ఏర్పాటు చేసిన దిమ్మెలు పగుళ్లు ఇచ్చి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. వీటివల్ల ఎప్పుడే ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామీణులు ఆందోళన చెందుతున్నారు.



పాణ్యంలోని సుంకులమ్మ ఆలయం సమీపంలో సైతం బంకుల వద్ద నియంత్రిక తక్కువ ఎత్తులోనే ఉంది. దీనివల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు.

★ బస్టాండు సమీపంలోని బనగానపల్లి రహదారిలో షాదీఖానా వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంపచెట్లు ఏపుగా పెరిగాయి. దీని చుట్టూ ఎలాంటి రక్షణ ఏర్పాట్లు చేపట్టలేదు.



నెరవాడ మెట్ట వద్ద ఏపీ గిరిజన మినీ గురుకుల పాఠశాల ఆవరణలోని విద్యుత్తు నియంత్రిక చుట్టూ కంపచెట్లు పెరిగాయి. దీనిచుట్టూ రక్షణ గోడ నిర్మించకపోవడంతో విద్యార్థులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

★ ఆలమూరు పరిధిలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలకు పగుళ్లు ఏర్పడ్డాయి. వర్షాలకు ఇవి కూలిపోయి ప్రమాదాలు జరిగే ఆస్కారముందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ తీగలు.. రైతుల్లో గుబులు

పాణ్యం మండలంలోని ఆలమూరు సమీపంలో ఉన్న ఎస్సార్బీసీ కాల్వ వంతెన కింది నుంచి కొందరు అక్రమంగా విద్యుత్తు కనెక్షను తీసుకోవడం వివాదంగా మారింది. సుమారు అర కిలోమీటరు మేర అనధికారికంగా విద్యుత్తు లైను ఏర్పాటు చేసుకున్నారు. పొలాలు, అటవీ ప్రాంతంలో కరెంటు తీగలను ఇష్టానుసారం తీసుకెళ్లడంతో పశువులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయని రైతులు ఫిర్యాదు చేయడంతో ఏఈ ప్రసాదరెడ్డి గురువారం పరిశీలించారు. అక్రమంగా ఏర్పాటు చేసుకున్న తీగలను తొలగించి ప్రమాదాలు జరగకుండా చూస్తామని ఏఈ చెప్పారు. – న్యూస్‌టుడే, పాణ్యం గ్రామీణం



ఆక్రమణలు తొలగించుకోవాలంటూ నోటీసులు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : పురపాలక సంఘంలో ప్రధాన రహదారితో పాటు పాత బస్టాండు, ఆర్టీసీ బస్టాండు, రఘునాథ్ సెంటరు, నంద్యాల మలుపులో దుకాణదారులు ఆక్రమణలను తొలగించుకోవాలంటూ గురువారం పట్టణ ప్రణాళిక అధికారులు నోటీసులు జారీ చేశారు. దుకాణాల ఎదురుగా ఏర్పాటు చేసుకున్న రేకులు, బండలు, మెట్లను దుకాణదారులు స్వతహాగా తొలగించుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారి రామకృష్ణ సూచించారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

ఆళ్లగడ్డ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ అభివృద్ధికి అన్ని విధాలుగా కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. గురువారం పురపాలిక కౌన్సిల్ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. ఆళ్లగడ్డ అభివృద్ధికి గతంలో ఇప్పటి ముఖ్యమంత్రి రూ.100 కోట్లు ఇస్తానని ఒక్క పైసా విడుదలలేదని, తమ ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నారన్నారు. ఆళ్లగడ్డ అభివృద్ధికి ఇప్పటికే పలుమార్లు ముఖ్యమంత్రిని కలిశానన్నారు. గండ్లేరు జలాశయం సామర్థ్యం 0.32 టీఎంసీల నుంచి 0.9 టీఎంసీలకు పెంచేందుకు రూ.40కోట్లను ఇచ్చేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారన్నారు. దీంతో ఆళ్లగడ్డ పురపాలిక నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఆళ్లగడ్డలో గత ప్రభుత్వ హయాంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు, షాప్‌లు, వెంచర్లు వేశారని, ఇందుకు ఉదాహరణ శిల్పా వెంచర్ అన్నారు. ఇలాంటి అక్రమాలు రాజీలేని విధంగా నేలమట్టం అవుతాయన్నారు. ఈ అక్రమాలకు సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదవుతాయన్నారు. ఆళ్లగడ్డలో పందులు, కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉందని, సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. పురపాలిక చైర్‌పర్సన్ డా.రామలింగారెడ్డి, వైస్‌చైర్మన్ నాయబ్ రసూల్, కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, ఏఈ దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నివాళులు అర్పించారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన చిత్రకారుడు విజయ్ రతన్ టాటా మృతికి సంతాపం తెలియజేస్తూ చిత్రాన్ని గీశారు. 'టాటా' అక్షరాలతో ఆయన ముఖ చిత్రాన్ని గీశారు.



బేతంచెర్ల ఎస్సైగా రమేష్ బాబు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: కర్నూలు పట్టణంలోని వన్‌టౌన్ ఎస్సైగా పనిచేస్తున్న రమేష్ బాబును బేతంచెర్ల ఎస్సైగా బదిలీ చేశారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న అశోక్ కుమార్‌కు సీఐగా పదోన్నతి పొంది బదిలీ అయ్యారు.

ఆకుకూరలతో ఆరోగ్యం

పచ్చర్ల(శిరివెళ్ల), న్యూస్‌టుడే: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబం ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవడం ద్వారా కంటిచూపును కాపాడుకోవచ్చునని కంటి వైద్య నిపుణుడు కృష్ణమోహన్‌రెడ్డి గురువారం పేర్కొన్నారు. ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని పచ్చర్లలో వైద్య, ఆరోగ్య, అంధత్వనివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లి: 80085 73763

శిరివెళ్ల: **సమస్య:** గోవిందపల్లె బీసీ కాలనీలో నీటి తొట్టె వద్ద అపరిశుభ్రత నెలకొంది. -సత్యవతి

సమాధానం: పారిశుద్ధ్య కార్మికుల ద్వారా చెత్తను తొలగిస్తాం. -లక్ష్మీ మనోహర్, పంచాయతీ కార్యదర్శి.

గంబూషియా చేప పిల్లల విడుదల



గంబూషియా పిల్లలను వదులుతున్న ఆరోగ్య సిబ్బంది

ముద్దవరం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: గంబూషియా చేప పిల్లలను నీటిలో వదిలినట్లు బేతంచెర్ల మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం ఆర్ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముద్దవరం, మద్దికుంట గ్రామాల సమీపంలోని చెరువుల్లో చేప పిల్లలను వదిలి మాట్లాడారు. సర్పంచి చిన్న తిమ్మయ్య, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఏమీ తినలేం...కొనలేం

పెరిగిన కూరగాయల ధరలతో బెంబేలు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కూరగాయల ధరలు పెరగడంతో మార్కెట్‌లో కొనేందుకు వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. నెల రోజులుగా వాటి ధరలు అమాంతం పెరగడంతో సామాన్యులు బెంబేలు చెందుతున్నారు. నిత్యావసరాల ధరలు పెరిగిన వేళ కూరగాయల ధరలు కూడా ఎక్కువవ్వడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దసరా పండగ నేపథ్యంలో కాయగూరల ధరలు పెరగడంతో తక్కువ తక్కువగా కొంటున్నారు.

అకాలవర్షాలతో....

వానలు కురవడంతో మార్కెట్‌కు రావాల్సిన కూరగాయల దిగుబడులు తగ్గిపోయాయి. తోటల్లోనే కుళ్లిపోతున్నాయని, రైతులు చెబుతున్నారని, ఇటువంటి పరిస్థితులు మరో రెండు నెలల వరకు ఉంటోందని రైతులు చెబుతున్నారు.

ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా...

కూరగాయ	ధర కిలో (రూపాయిల్లో)
టమాటా	80
వంకాయలు	80
ఉల్లిగడ్డలు	60
ఆలుగడ్డలు	60
బీట్‌రూట్	60
క్యారెట్	80
అల్లం	120
బెండకాయలు	60
బీరకాయ	60
కాకరకాయ	60
కొత్తిమీర కట్ట	25
బీన్స్	120
మునగకాయ	200
క్యాప్సికం	100
దొండ	60

టమాటా, బీన్స్, మునగ కాయల ధరలకు రెక్కలు

మార్కెట్‌లో కూరగాయల ధరలు అమాంతం పెరిగాయి. కిలో టమాటా రూ.80, బీన్స్ రూ.120, మునగకాయ రూ.200లు ఉండటంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు.



టమాటా ధరలు సామాన్యులకు అందుబాటులో లేవని ఆందోళన చెందుతున్నారు.

కిలో దగ్గర అరకిలో కొంటున్నాను

– పుల్లమ్మ, బనగానపల్లి

ప్రస్తుత మార్కెట్‌లో కూరగాయల ధరలు చుక్కల్ని చూపిస్తున్నాయి. ఎక్కువగా వినియోగించే ఉల్లి కిలో రూ.60. టమాటా రూ.80 పలుకుతుండటంతో కిలో దగ్గర అరకిలోతో సర్దుకుంటున్నాం. అన్ని రకాల కూరగాయలదీ అదేదారి.

సామాన్యులకు కష్టమే: – అంజలి

ప్రస్తుత మార్కెట్‌లో కూరగాయలు సామాన్యులకు అందుబాటులో లేవు. ఏదీ కొందామన్నా.. కిలో రూ.50లకు పైనే ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉల్లిగడ్డలు కొనకుండానే రేటు వింటే కన్నీళ్లు వస్తున్నాయి. మంచివి రూ.60ల వరకు ధర పలుకుతున్నాయి. టమాటా రేటు ఎరుపెక్కింది. మునగ మరింత దారుణంగా తయారైంది.

సాంస్కృతిక కార్యక్రమాలతో నిమజ్జనం

బేతంచెర్ల,న్యూస్‌టుడే: ఈనెల 13న అమ్మవారి నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి డీజేలకు అనుమతి లేదని, సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి ఊరేగింపును ప్రశాంతంగా జరపాలని చైర్మన్ శేషాచలంరెడ్డి పేర్కొన్నారు. గురువారం బేతంచెర్ల నగర పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ ప్రకాష్ బాబు, కమిషనర్ హరిప్రసాద్, అధ్యక్షతన దుర్గాదేవి మహోత్సవ కేంద్ర సమితి గౌరవాధ్యక్షుడు గౌరి ఉస్సేన్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. 13న ఉదయం త్వరగా అమ్మవారికి పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. హెచ్‌సీ మాసం, దుర్గాదేవి మహోత్సవ కేంద్ర సమితి సభ్యులు మురళీకృష్ణ, వీరారెడ్డి, నాగమోహన్, నాగరాజు, గాజుల హరికృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శేషాచలంరెడ్డి

మెరుగైన జీవనోపాధికి అవకాశాలు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద మెరుగైన జీవనోపాధి అవకాశాలు కల్పించనున్నట్లు కర్నూలు ఏజెన్సీ చెందిన అసిస్టెంట్ జి.రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌లో టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో ప్రాజెక్టు ట్రైనింగ్ పార్ట్‌నర్ స్కిల్‌డెవ్ అధ్యక్షతన ప్రధానమంత్రి విశ్వకర్మ కింద అవగాహన కల్పించారు. పీఎం విశ్వకర్మ తాకట్టురహితమైన రుణం రూ.3 లక్షల వరకు, రూ. 15వేల విలువ చేసే టూల్ కిట్ ప్రోత్సాహకాన్ని అందిస్తారని తెలిపారు. రోజువారీ భత్యం రూ.500లతో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు ఐదు రోజుల పాటు శిక్షణ ఇప్పిస్తారని, నాణ్యత ధ్రువీకరణ మార్కెటింగ్ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

ప్యాపిలి: ఈ నెల 11వ తేదీ సాయంత్రం వరకు మద్యం దుకాణాల లైసెన్సులకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆబ్కారీ ఎస్సై సోమశేఖర్‌రావు పేర్కొన్నారు.

కోవెలకుంట్ల: ప్రభుత్వం అమలు చేసిన నూతన మద్యం విధానంలో ఎవరైనా నిర్భయంగా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ తబీబాషా పేర్కొన్నారు.

బేతంచెర్ల: మద్యం దుకాణాలకు ఈనెల 11 వరకు ప్రభుత్వ గడువు పెంచిందని, ఎవరైనా దరఖాస్తులు చేసుకోవచ్చని, ఇందులో ఎవరికి.. ఎవరికీ భయపడొద్దని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు పేర్కొన్నారు. గురువారం బేతంచెర్ల పోలీసు స్టేషన్‌లో ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్ దాస్ అధ్యక్షతన విలేకర్ల సమావేశం నిర్వహించారు.

బనగానపల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం విధానంలో నిర్భయంగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.రాముడు పేర్కొన్నారు. ఈ నెల 11న రాత్రి 7 గంటల వరకు దరఖాస్తుకు గడువు పొడిగించారని, 14న ఉదయం 8 గంటల నుంచి కలెక్టరేట్ వద్ద లక్కీ డ్రా తీస్తారని తెలిపారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బనగానపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి వెంకటరమణ గురువారం తెలిపారు. ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అవుకు: టాటా సంస్థల అధినేత రతన్ టాటా దేశం గర్వించదగ్గ గొప్ప వ్యక్తి అని, లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపిన దార్శనికుడని, మానవతావాది మరణం తీరని లోటు అని అవుకు మండలాధ్యక్షుడు చల్లా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. గురువారం టాటా మరణంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

సౌదరదిన్నె: సౌదరదిన్నె సచివాలయం వెనుక వీధిలో మురుగు కాలువలు మట్టితో నిండిపోయాయి. తొలగించాలి.

సంజామల: తనకు తెలియకుండానే ఏసీ గోదాము యజమాని తాను దాచిన మిరప కాయలను విక్రయించారని, తనకు న్యాయం చేయాలని పేరుసోముల రైతు కంకర సూర్యనారాయణరెడ్డి గురువారం విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి తనకు తెలియకుండా మిరప కాయలను అమ్ముకున్న గోదాము యజమాని, బ్యాంకు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ముగ్గురిపై పోక్సో కేసు నమోదు

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా డోన్ మండలంలోని మల్యాల గ్రామంలో ఏడేళ్ల బాలుడిపై అదే గ్రామానికి చెందిన మరో ముగ్గురు మైనర్ బాలురు కలిసి లైంగికంగా, దారుణంగా వేధించిన వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో వారిపై పోక్సో కింద కేసు నమోదు చేసినట్లు గ్రామీణ సీఐ రాకేశ్ తెలిపారు. గ్రామంలో ఓ బాలుడు ఆడుకుంటుండగా.. ఈ ముగ్గురు కలిసి ఆ పిల్లాణ్ని ఊరి బయటకు తీసుకెళ్లారు. అసభ్యకరంగా, లైంగికంగా హింసించి వేధించారు. ఈ దారుణాన్ని ఆ యువకులు వీడియోలు తీశారు. బాలుడిని లైంగికంగా వేధించిన వీడియోలు గురువారం బయటకు రావడంతో పోలీసులు గ్రామానికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ

రుద్రవరం: రుద్రవరం అటవీ సెక్షన్ అధికారిగా కాశీంనాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గాజులపల్లె అటవీ కలప విభాగంలో విధులు నిర్వహించే కాశీంనాయక్ ఉన్నతాధికారుల ఆదేశాలకు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

జేజేలు దుర్గమ్మ... కరుణ చూపమ్మా..!



రుద్రవరం: మహిషాసుర మర్దిని



ప్యాపిలిలో: దుర్గాదేవి అలంకారంలో శ్రీ వాసవిమాత



కోవెలకుంట్ల: కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో మహిషాసురమర్దిని



డోన్: మహిషాసురమర్దిని అలంకారంలో విజయ కనకదుర్గాదేవి

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజించారు. మమ్మేలు మా దుర్గమ్మా... మాపై కరుణచూపమ్మా అంటూ కొలిచారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు.

–న్యూస్‌టుడే బృందం



చాగలమర్రి: పులి వేషధారణల్లో చిన్నారులు



బేతంచెర్ల: అమ్మవారి పూజల్లో మహిళలు, తెదేపా నాయకులు

వినియోగంలోకి తెచ్చేదెన్నడో...?

కోవెలకుంట్ల శివారు తహసీల్దారు కార్యాలయం దగ్గర ఉన్న బస్‌షెల్టర్ నిరుపయోగంగా మారింది. కొన్నేళ్ల కిందట చల్లా రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రయాణికుల సౌకర్యార్థం షెల్టర్ నిర్మించారు. తహసీల్దారు, వ్యవసాయ, రిజిస్ట్రార్, ట్రెజరీ, ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయాలు, కోర్టు, గురుకుల పాఠశాల ఉన్నాయి. ఆయా కార్యాలయాలకు వచ్చే ఉద్యోగులు, ప్రజలకు ఇక్కడ షెల్టర్ ఉపయోగంగానే ఉండేది. దీన్ని వినియోగంలోకి తెచ్చేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, కోవెలకుంట్ల



ముళ్లపొదలు తొలగించరూ!



రూపనగుడి చెరువు కట్టపై ముళ్ల పొదలు ఎక్కువవ్వడంతో ఇబ్బందులుపడుతున్నారు. 2019-2020లో చెరువు అభివృద్ధికి ప్రపంచ బ్యాంకు నిధులు రూ.1.20 కోట్లు ఖర్చు చేసి ముళ్ల పొదలు తొలగించి 500 మీటర్ల పొడవునా కట్ట బలోపేతం చేశారు. 1200 మీటర్ల మేర సాగునీటి కాల్వ ఏర్పాటు, తూము నిర్మాణ పనులు చేపట్టారు. పనులు చేపట్టి నాలుగు సంవత్సరాలు దాటినా చెరువు బాగోగులు అధికారులు పట్టించుకోవటం లేదు. దీనిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, రూపనగుడి(ఉయ్యాలవాడ)

కాల్వ నిర్మాణం పట్టదా..?

పట్టణం నడిబొడ్డున పాతబస్టాండు సమీపంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన మురుగుకాలువ పాడైంది. ఇక్కడ సీసీ కాలువ నిర్మాణాన్ని చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, డోన్‌పట్టణం



కల్వర్టు దెబ్బతిన్నా..మరమ్మతులేవీ..?



రైల్వేస్టేషన్ మద్రి రాఘవయ్య భవనం సమీపాన రహదారిలో ఉన్న మురుగుకాల్వపై కల్వర్టు పాడైంది. కల్వర్టు పూర్తిగా దెబ్బతిని..ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం ఆ దారిలో పదుల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రైల్వే అధికారులు పాడైన కల్వర్టును తొలగించి కొత్తది నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, డోన్‌పట్టణం

జాగ్రత్తలు తీసుకోవాలి

దొర్నిపాడు, న్యూస్‌టుడే: సీజన్ వ్యాధులు రాకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి నాగేంద్ర పేర్కొన్నారు. జలుబు, దగ్గు, జ్వరంతో బాధ పడుతున్న వారు కాచిన వేడి నీటిని తాగాలన్నారు.

విశిష్టరకం సాగుచేస్తే అధిక దిగుబడులు

కొత్తకోట(డోన్), న్యూస్‌టుడే: వేరుశనగలో విశిష్టరకం సాగు చేస్తే చక్కటి దిగుబడులు వస్తాయని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి అన్నారు. గురువారం కృషివిజ్ఞాన కేంద్రం యాగంటిపల్లె ఆధ్వర్యంలో కొత్తకోటలో వేరుశనగ నూతన విశిష్ట రకం దిగుబడులపై క్షేత్రస్థాయి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా 125 ఎకరాల్లో పండించిన పంట దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, రవిగౌడ్, వ్యవసాయాధికారి అబ్దుల్‌షఫి, కొత్తకోత వీఏఏ దస్తగిరమ్మ తదితరులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయి పర్యటనలో వ్యవసాయాధికారులు, రైతులు, శాస్త్రవేత్తలు

రహదారి ప్రమాదంలో ఒకరి మృతి

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: మండలంలోని కమలాపురం గ్రామం సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. కమలాపురానికి చెందిన కుమ్మరి షెక్షావలి, ఆయన కుమారుడు వేణుగోపాల్, రామచంద్రుడు కలసి డోన్‌కు వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తుండగా, ధర్మవరం గ్రామానికి చెందిన హరిజన వెంకటేష్ మరో ద్విచక్ర వాహనంపై ఎదురుగా వచ్చి ఢీకొన్నారు. ఈ ఘటనలో షెక్షావలి మృతి చెందగా... ముగ్గురికి గాయాలవ్వడంతో వారిని డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యానికి కర్నూలుకు తరలించారు.

ప్రశాంత వాతావరణంలో జీవించాలి

పెద్దపూదెళ్ల(ప్యాపిలి), న్యూస్‌టుడే: గ్రామాల్లో ఎవరూ గొడవలకు వెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలని ప్యాపిలి ఎస్సై మధుసూదన్ తెలిపారు. గురువారం మండలంలోని పెద్దపూదెళ్ల గ్రామంలో గ్రామస్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

జలదుర్గం(ప్యాపిలి), న్యూస్‌టుడే: వాహనదారుల వద్ద తప్పనిసరిగా అన్ని రకాల పత్రాలు ఉండాలని జలదుర్గం ఎస్సై నాగార్జున సూచించారు. బావిపల్లె క్రాస్ వద్ద సిబ్బందితో కలిసి గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. అవసరమైన పత్రాలు లేని 20 మంది వాహనదారులకు రూ.3 వేలు జరిమానా విధించారు.

ధర పతనం.. రైతన్నకు శోకం

✦ మిర్చిని దున్నేస్తున్న పరిస్థితి ✦ గిట్టుబాటు కావడం లేదని వేదన

చాగలమర్రి, రుద్రవరం, న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టించి, శ్రమించే రైతులు అతివృష్టి, అనావృష్టి లేదంటే రేటు బాగోలేదనే కారణాలతో నష్టపోతూనే ఉన్నారు. ఒకసారి ప్రకృతి ప్రకోపిస్తే, మరోసారి ధరలు పరిహాసం చేసి, మరోసారి పొలాలు వైరస్ తెగుళ్ల బారిన పడి ఏటా ఆందోళన చెందుతూనే ఉన్నారు. నియోజకవర్గంలో పచ్చి మిరప సాగు చేసిన రైతుల పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. పంట దిగుబడి వచ్చినా ధర లేకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పచ్చి మిర్చి కిలో రూ.10లు మాత్రమే ధర పలుకుతుండటంతో రైతులు పంట పొలాల్లోనే వదిలేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటల కోసం దున్నేస్తున్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో దాదాపు వెయ్యి ఎకరాల్లో రైతులు పచ్చి మిర్చి సాగు చేశారు. ధర లేక ఇబ్బందులు పడుతున్నారు.

పంట సాగైన వివరాలు

మండలం	సాగు (ఎకరాల్లో)
చాగలమర్రి	150
రుద్రవరం	650
ఆళ్లగడ్డ	200



రుద్రవరం ప్రాంతంలో సాగు

ఆరుబస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది

–వెంకటేశ్వర్లు, రెడ్డిపల్లె.



రెండెకరాల్లో మిర్చి సాగు చేశాను. వాతావరణ పరిస్థితులు అనుకూలించక, అధిక వర్షాలు కురవడంతో పంట దిగుబడి రాలేదు. దాదాపు రూ.2లక్షలు పెట్టుబడి పెట్టి పచ్చిమిర్చి సాగు చేస్తే కేవలం ఆరు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. దిక్కుతోచక ఇతర పంటల్ని సాగు చేసుకుందామని దున్నేశాను. ప్రభుత్వం స్పందించి ఆదుకుంటే బాగుంటుంది.

రెండెకరాల్లో దున్నేశాను

–గోపాల్, డి.వనిపెంట



రెండెకరాల్లో పచ్చిమిర్చి సాగు చేశాను. పంట దిగుబడి బాగా వచ్చింది. కానీ 50కేజీల పచ్చిమిర్చి ధర కేవలం రూ.500లకు కూడా వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. మిర్చి కోత కోస్తే కూలి ఖర్చులు కూడా రావడం లేదని ట్రాక్టరుతో దున్నేశాను. దాదాపు రూ.2 లక్షలు నష్టం వాటిల్లింది.

నిధుల వరద.. సదుపాయాల పరదా

బేతంచెర్ల,న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల వద్ద చిన్నారులకు, సిబ్బందికి ఉపయోగపడేలా తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా వ్యవహరించింది. ప్రస్తుత తెదేపా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల వద్ద సమస్యలకు పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తోంది. ప్రధానంగా చిన్నారులు తాగేందుకు నీటి సౌకర్యం, వినియోగించుకునేందుకు మరుగుదొడ్ల నిర్మాణానికి ఒక్కో కేంద్రానికి రూ.17 వేలు, మరుగు దొడ్ల నిర్మాణానికి ఒక్కో కేంద్రానికి రూ.36 వేలు మంజూరు చేసింది.



చిన్నారులకు ఆట పాట నేర్పుతున్న అంగన్‌వాడీ టీచర్

ఎక్కడెక్కడంటే...

డోన్ నియోజకవర్గంలో బేతంచెర్ల మండలంలో తాగునీటి సౌకర్యం 29 చోట్ల కల్పించగా, మరుగు దొడ్లు తొమ్మిదిచోట్ల బాగు చేయాలని నిర్ణయించారు. ప్యాపిలిలో మరుగుదొడ్లు 18, తాగునీటి సౌకర్యం 28, డోన్ మండలంలో మరుగు దొడ్లు 7, తాగునీటి సౌకర్యం 28 కేంద్రాల్లో కల్పించేందుకు ప్రభుత్వం నిధుల్ని విడుదల చేసింది. డోన్ సబ్‌డివిజన్‌లో తాగునీటి సౌకర్యం 68 చోట్ల కల్పించాల్సి ఉండగా, మరుగుదొడ్ల సౌకర్యం 34 కేంద్రాల్లో కల్పించనుండటంతో అంతా ఆనందం వెలిబుచ్చుతున్నారు.

త్వరలోనే పనులు

–షంషాద్ బేగం, సీడీపీవో

అంగన్‌వాడీ కేంద్రాలకు చాలా వాటికి తాగునీరు, మరుగు దొడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటుడంటంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. స్పందించిన కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల వద్ద తాగునీటి, మరుగుదొడ్ల సౌకర్యం కల్పనకు తెదేపా ప్రభుత్వం ఆర్‌డబ్ల్యూఎస్‌కు అనుసంధానం చేసి నిధులు కేటాయించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించి త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.